# సంతానం

మా ఆవిడకు పిల్లలంటే ఎంతో యిష్టం. నాకు మహా చిరాకు. ఆమె కాపరానికొచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలోనూ తన వాంఛను చాలా సార్లు నాకు వ్యక్తావ్యక్తంగా తెలియజేసింది. తన కోర్కె ఎంత బలీయమైందో, అది నా ముందు రుజువుచేసుకోడానికిగాను పక్కింటి పిల్లలను అస్తమానూ తనదగ్గరేవుంచుకొంటుండేది. వాళ్ళు దాన్ని నానా ఖంగాళీ చేస్తుంటారు. వొంటిమీద వొకటికి, రెంటికీ గూడా పోతుండేవారు. అది ఏ మాత్రం అసహ్యించుకోదు సరిగదా "పసిపిల్లలాయె, ఏం తెలుస్తుంది మరి?" అంటుంది పైగా.

పొరుగింటి పిల్లలమీద తనకుండేంత వాత్సల్యం నాకూ వుండాలని మా ఆవిడ వాదిస్తుంది. "మనకు ఎటుగూడి. లేనే లేరు. ఎదటివారికి వున్నందుకన్నా సంతోషించరాదూ" అంటుంది.

"మనకు లేరనే సంగతి బాగా నేవుంది. ఎదటివారికున్నదని నే నెప్పుడూ సంతోషించకుండా పోలేదు. అల్లాంటి తక్కువరకపు బుద్ధులకు నేను చాలా దూరంగా వుంటాను" అన్నాను.

"అంతవరకే; కనిపిస్తూనే వుందిగా మీ మాటలపస. మీకు నిజంగా "అదే లేకపోతే; మొన్న రాధాయ్‌గాడు మీ టేబుల్ దగ్గరకొస్తే ఎందుకు గసిరారండీ?"

అప్పుడేదో రాసుకుంటున్నాను. ఆ వేళన వొచ్చాడు. వొచ్చినవాడు నా దగ్గరికొచ్చి "నాన్నా చీఁయ్ఁ" అంటాడు, తన చీమిడి ముక్కును నాకు చూపిస్తూ. అందుకని గసిరాను. అది మా ఆవిడకు కటువైంది. వాళ్లో వాళ్ళు పనీపాటా లేకుండా ఉత్పత్తిచేస్తున్న పిల్లలందరికీ చీమిడి తుడవడమే నా డ్యూటీలాగా మాట్లాడుతుంది మా ఆవిడ. పిల్లలమీద తనకు ఆపేక్షవుంటే వుండొచ్చు. అదేలాగా ప్రతివాళ్ళకూ వుండాలని కోరడం సబబైన విషయంగాదు. తనకు ఆపేక్ష వుందిగాబట్టి పిల్లల మూతీముక్కీ తుడవమను, నాకేమాత్రం అభ్యంతరంలేదు. తనుచేస్తునట్లు ప్రతివాళ్లూ చేయాలని తన కొలబద్దల్తో అందర్నీ కొలవచూడడం సాహసం......

ఈ పిల్లలసమస్య భార్యాభర్తలమైన మా ఇద్దరికేగా కుండా చాలామందికి అంటుకొంది. మా అత్తా మామగ్గూడా ఇదేసమస్య పట్టుకుంది.

"మాలక్ష్మికడుపున వొక కాయకాస్తే చూసి చద్దామనివుంది" అంది మా అత్త. తను ఈ ప్రపంచంలో వుండడం కేవలం తనకూతురు సంతానాన్ని చూడడం కోసమేననే భావాన్ని ధ్వనింపచేస్తూ.

బంధువులకు స్నేహితులకూ, చివరకి ముఖపరిచయస్తులికిగూడా ఇదే ధోరణి.

"పిలలు ఏమనా..." అంటారుగ

"ఇంటికి పిల్లలే కళండీ. లేకపోతే ఏముందీ ? ఎడారి; ఇసుకఎడారి" అంటారు, పదేసిమంది సంతానాన్ని కన్న వారు నోరుచప్పరిస్తూ.

మొత్తంమీద ప్రతివాళ్ళకూ నా సంతానానికి సంబంధించిన దిగులు కొంతవుంది. నాకు యిష్టం వున్నా లేకున్నా వీళ్ళందరి సంతోషం కోసమైనా నేను పిల్లల్ని కనిపెంచవలసిన బాధ్యత ఎక్కువగా కనిపిస్తుంది.

నేను ఈ విధంగా మల్లగుల్లాలు పడుతూనే వున్నాను. మా ఆవిడ తనప్రయత్నాన్ని సాగిస్తూనేవుంది. ఎరికెలవాళ్ళకు పాతకోకలిచ్చి సోది అడుగుతోంది. కనపడ్డ ప్రతి బైరాగి వెధవచేతా తాయత్తులు, రక్షరేఖలు కట్టించుకొంటుంది. ఆచార్ల వారిదగ్గర తులసితీర్థమూ, అంజనేయస్వామిగుడికి ప్రదక్షిణాలూ సాగించింది. సత్యన్నారాయణ వ్రతాలూ, ఏకాదశి వుపవాసాలూ ప్రారంభించింది. దీనిభక్తి, దీక్షా చూస్తే పుటిక్కన ఏదేవుడేనా కరుణించి దీనికి పిల్లలను పుట్టిస్తాడేమోనని నాకు మహాభయంగా వుంది. దానిదంతా వొట్టి డాంబికమనీ, స్వార్థంకోసం మిమ్మల్ని ప్రార్థిస్తుందిగానీ మీమీద భక్తిచేత గాదనీ, స్వలాభకాంక్షుల ఈప్సితాలు తీర్చడం చాలా నీచమనీ నేను దేవతాగణాన్ని వేడుకోవలసివొచ్చింది.

దేవతలుగూడా ఆడవాళ్ళ పార్టీయే! నా ప్రార్థనలూ, వేడికోలులూ దుమ్ములో కలిసిపొయ్యాయి. మా ఆవిడ కోరికే నెగ్గింది. దేవతలు ప్రత్యక్షమై మాఆవిడకు "సంతు"ను ప్రసాదించకపోయినా దేవతల్లో లెఖ్ఖగట్టవలసిన మహాయోగి వొకడు మా గ్రామపరిసరాల్లో ప్రత్యక్షమయ్యాడు.

ఆయన నూటయాభైసంవత్సరాలు హిమాలయపర్వతాల్లో చండప్రచండంగా తపస్సుచేసి ప్రస్తుతం భూలోక సంచారం కావిస్తున్నాడట.

చూసినవాళ్ళంతా ఆయన్ను "మహాపురుషుడ"ని పొగడటం స్వయంగా విన్నాను.

ఎవరికి ఏపనికావలసినా ఆయన "నావల్లకాదు"అనడు. సంతానంలేనివాళ్లు ఎంతోమంది ఆయనవల్లసంతునుపొందారు. రోగాలు, కరువులు, తుపానులు, యుద్ధాలు—సర్వం ఆయన తన గోటితో తీసివేస్తాడు. మహారుషి" అన్నారు చాలమంది.

మా ఆవిడకూడ స్వామీజీ దగ్గరకు పోతానంది. కనిపించని దేవతలను ప్రార్థించడం, వారువరమీయడం వేరు సంగతి. ప్రత్యక్షంగా కళ్ళముందు కనిపిస్తున్నాయన, అందులో నూట యాభై సంవత్సరాలు ఘోరాతి ఘోరంగా తపస్సు చేసిన మహారుషి "వరం" ఈయడమూ, అది ఖాళీగావడమూ కలలోని మాట. నా ప్రత్యుత్తరాన్ని లెఖ్ఖచేయకుండా స్వామీజీ దగ్గరకుపోయింది మాఆవిడ—

రాత్రికి మా పొరుగింటావిడ చెప్పింది.

" స్వామివారు మీ ఆవిడ ప్రార్థనను ఆలకించారు. పూర్వజన్మలో మీ ఆవిడ శిశుఘాతకురాలట. ఆ పాపం పరిహారం చేయడంకోసం ఏడు రాత్రుళ్ళు ఏకాంతోపదేశం చేయాలట. అప్పటిగ్గాని బిడ్డలుపుట్టరు"

నేను మా ఆవిడముఖం చూశాను. నిజమే నన్నట్టు తలతిప్పింది.

"అయితే ఏడు రాత్రుళ్ళూ పోతావన్నమాటేగా?" అన్నాను.

"ఇంకా అన్నమాటేగా ఏమిటండీ? అసలు ఆ మహానుభావుడు మనను పలకరించిందే మహాభాగ్యం. అల్లాంటప్పుడు వారే స్వయంగా ఉపదేశం చేస్తానంటే పోకుండాఎట్లా? నేనొక్కదాన్నేనా ఏమిటి? మన వీధిలోనివాళ్ళు చాలామంది వున్నారు"

"వాళ్ళంతా పిల్లలకోసమేనా"?

"మీకు గాబట్టి పిల్లలంటే అసహ్యం. అందరూ అట్లాగే వుంటారా ఏమిటి"?

నేనేం మాట్లాడలేదు.

ఏడు రాత్రుళ్ళూ ఏకాంతోపదేశం పొందింది. మా ఆవిడ.

ఎనిమిదో రోజున స్వామివారిని వారిశిష్యగణాన్ని మా యింటికి భిక్షకుపిలిచి నాచేత వందరూపాయలు ఖర్చు చేయించింది.

పోతూపోతూ స్వామివారు దీవించారు. "తొందరలో సుపుత్రుణ్ని ఎత్తుకొందువుగాక!" అని.

గ్రామంలోని భిక్షలన్నీ పూర్తి చేసుకొని స్వామివారు పీఠం ఎత్తేశారు. స్వామివారు వెళ్ళిపోయిన తొమ్మిది నెలలకు వారివద్ద ఏకాంతోపదేశం పొందిన ఆడవాళ్ళంతా ప్రసవించారు. స్వామివారు సమదృష్టి కలిగినవారు. వారికి ఉచ్చనీచాలు లేవు. అందరికీ వొకే రూపు రేఖలు కలిగిన సంతానం

దిగింది. కళ్ళు, ముక్కు, నోరు, తల, శరీరం, రంగు, అంతా ఒకటేరకం. స్వామివారికీ వారు ప్రసాదించిన సంతానానికీ భేదం చీమతలకాయంతైనా లేదు. అచ్చుగుద్దినట్లుగా స్వామి వారి పోలిక.

నాకు పిల్లలంటే మహాచిరాకే అయినా స్వామీజీ ప్రసాదించాడు గాబట్టి వాణ్ణి ఎంతో లాలనగా చూస్తుంటాను.